


# రాధామోహనం
## - దేవరకొండ అన్నపూర్ణ



*ఇది ఒక అందమైన రాధామోహనగాథ. మనందరిలోను అంతర్లీనంగా ఉండి కాలప్రవాహంలో పడి మరిచిపోతున్న ప్రేమాభిమానాలనీ అనుభూతులని గుర్తు చేస్తూ, మనల్ని నవ్విస్తూ, అప్పుడప్పుడూ కళ్ళని చెమరుస్తూ, పనిలోపనిగా మరిచిపోతున్న విలువల్నీ మనుషులుగా మన బాధ్యతలనీ తట్టిలేపే కథామాలిక..!!*

*(గత సంచిక తరువాయి)*

## *సమయానికి తగుమాటలాడెనె*

### *2*

**హాస్పిటల్ నుంచి** వస్తూనే స్నానం చేసి పిల్లల్ని రెడీ చేసి డిన్నర్ పెట్టేసి తన 'మధుశాల' సమయం కోసం కూర్చుంది డాక్టర్ రాధ. అయ్యగారు ఆటలయ్యి వచ్చేసరికి తన అలసట కూడా కూడా తీరితే ఇవాళ అమెజాన్ ప్రైమ్ లో సినిమా చూద్దామని ప్లాన్ మరి.. ఇవాళ డి.ఎస్.పి మూడ్ అనుకుంటూ ప్లేలిస్ట్ పెట్టగానే...

'జత కలిసే జత కలిసే జగములు రెండు జత కలిసే...

జత కలిసే జత కలిసే అడుగులు రెండు జత కలిసే

జనమొక తీరు వీళ్లదొక తీరు ఇద్దరొకలాంటి వారు.

అచ్చు గుద్దినట్లు ఒక్కటే కలగంటూ ఉన్నారిద్దరూ...

ఏ కన్ను ఇపుడు చదవని పుస్తకమై వీరు చదివేస్తున్నారనందంగా ఒకరిని ఇంకొకరు.

ఈ మధ్యకాలంలో పాటల్లో సాహిత్యానికి విలువ ఉండట్లేదని వాదించేవాళ్ళకి సమాధానం చెప్పే పాటల్లో ఇదొకటి. చాలా సున్నితంగా ప్రేమంటే వర్ణిస్తూనే రామజోగయ్య గారంటారూ...

'నలుపు జాడ నలుసైనా అంటుకోని హృదయాలు

తలపు లోతున ఆడమగలని గుర్తులేని పసివాళ్ళు

మాటలాడుకోకున్న మది తెలుపుకున్న భావాలు

ఒకరికొకరు ఎదురుంటే చాలులే నాట్యమాడు ప్రాయాలు

పేరుకేమో వేరు వేరు బొమ్మలేమరీ

ఇరువురికి గుండెలోని ప్రాణమొక్కటే కదా

బహుశా బ్రహ్మ పొరపాటుఏమో ఒక్కరే ఇద్దరు అయ్యారు'

పాట కట్టిన కుర్రాడు డి.ఎస్.పి కూడా సాహిత్యానికి విలువిచ్చి రణగొణధ్వనులు తగ్గిస్తే, దర్శకుడు కొరటాల శివ దాన్ని అంతే సున్నితంగా హత్తుకునేలా అసలు అభ్యంతరం లేనంత ఆహ్లాదంగా కూడా అందమైన జంటతో యుగళ గీతం తీయొచ్చని నిరూపించాడు.

ప్రేమంటే – ఇవాళ చూసుకోవడం రేపు మాట్లాడటం ఫోనుల్లో గంటలకొద్దీ మాట్లాడేసుకుని చాటింగ్ లో హద్దులు మర్చిపోడం. డేటింగుల పేరుతో ఊరంతా తిరగడం, హద్దులు చెరిపేసి రేపేంటో ఆలోచించకుండా ప్రవర్తన, నెమ్మదిగా నచ్చనివిషయాల్లో గొడవలు.. చివరకు నీ బ్రతుకు నీది నా బ్రతుకు నాది అనుకునే ఈ రోజుల్లో.. ఖర్మ కాలి ఈ మధ్య విడిపోతే కూడా పార్టీలుట!

అలాంటిది మాట్లాడుకోకుండా మదిలో భావాలు తెలుపుకున్నారని కవి అంటే, భలే కొత్తగా... అరె మనలాగే అనుకున్నారు రాధ మోహన్ కూడా.

గతం కళ్ళముందు ఆవిష్కృతం అవుతూంటే దీర్ఘాలోచనలో పడింది రాధ.

అవి రాధ ఎమ్మెస్ రామయ్య మెడికల్ కాలేజ్ లో చేరిన రోజులు.

అప్పట్లో బెంగళూరులో ఇప్పుడున్నంత జనాభా గానీ కాలుష్యంగానీ ఉండేది కాదు చాలా ప్లాన్డ్ సిటీ. ప్రతి బ్లాక్ కీ మధ్యలో పార్కులు, వాకింగ్ కీ అనువుగా ఫుట్ పాతులు, రోడ్డు పక్కన సాయంత్రం అవ్వగానే వచ్చే పూల–పళ్ళ వ్యాపారులు.. హాస్టల్ నుంచి కాలేజికి రెండు మైళ్లు ఉంటుందేమో మహా అయితే. సరదాగా నడిచి వెళ్లేటపుడు మధ్యలో ఈ చిరువ్యాపారులతో మాట్లాడుతూ నేర్చుకుంటున్న కన్నడ ఇంటి నుంచి మొదటి సారి బయటికి రావడంతో కళ్ళల్లో ఇంకా బెరుకు. కొత్త స్నేహితులు వాతావరణం అన్నీ కలిసి జీవిత గమనాన్ని వెతుక్కుంటున్న రోజులు.

అప్పటిదాకా ఏదో పల్లెటూరిలో మెడికల్ క్యాంపు అని ఒక నెలంతా సీనియర్లు లేకుండా రాగింగు బాధ లేకుండా గడిచింది. ఆ రోజు వాళ్ళు వెనక్కి రావడం తెలుస్తూనే ఉంది. హాస్టల్లో సీనియర్లు తక్కువ ఉంటారు. అప్పటికే బయట రూములు తీసుకునేవాళ్లే ఎక్కువ. నలుగురే ఉన్నారు హాస్టల్లో. వాళ్ళు పొద్దున్న మెస్లో ఏమి పట్టించుకోకపోయినా వాళ్ళ ఉనికి తెలిసింది, జూనియర్లు బాగా నిశ్శబ్దంగా ఉండడంతో.

కాలేజ్ గేట్ బయటనుంచే తేడా తెలుస్తోంది. పిలవడం.. పేర్లు ఇంట్రోలూ వినిపిస్తున్నాయి. వడివడిగా అడుగులు వేస్తోంది రాధ.

'హేయ్ బ్లూ డ్రెస్.. ఇటు' అని వినిపించింది.

అయిపోయాను అనుకుంటూ అడుగులు ఆపి సందేహంగా చూసింది, పిలిచింది తనని కాకూడదన్న చిరు ఆశతో.

బైక్ మీద ఇద్దరూ, పక్కన ముగ్గురూ – అబ్బాయిలు. తనవైపే చూస్తూ. 'ఇలా రా!' అన్నారు మళ్ళీ.

నిరుత్సాహంతో నీరసంతో, మనసులో మాత్రం ఒక మూల మొదటి సారి రాగింగ్ అన్న కుతూహలాన్ని అధిగమించేసిన జంకుతో వెళ్ళింది రాధ.

"ఇంట్రడక్షన్ సాంగ్ వచ్చా? ఏ ఊరు?" అన్నాడొకతను.

హాస్టల్ లో బట్టీ పట్టేసానన్న ధైర్యంతో "ఊ.." అనేసి ఆ టెన్షన్ లో తల మాత్రం అడ్డంగా ఊపింది రాధ.

బైక్ మీద కూర్చున్న రెండో అబ్బాయి ఫక్కున నవ్వి" టెన్షన్ అక్కర్లేదు. వెళ్లి రేపొచ్చి చెప్పు.. పో.." అన్నాడు పక్కవాడి భుజం నొక్కుతూ "మా వూరేరా!" అని చిన్నగా. ఆశ్చర్యంగా తలెత్తి చూసి వెనక్కి తిరిగి వచ్చేసింది.

ఆ తర్వాత అతనే (మోహన్) రాగింగ్ టైం అయ్యి, ఫ్రెషర్స్ డే దాకా ఏదో ఒకలా ఎక్కువ రాగింగ్ కాకుండా తనని పక్కకి తీసుకెళ్లడంతో మొత్తానికి గండం గట్టెక్కడమే కాదు సీనియర్స్ అందరికీ తెలిసిపోయింది రాధ. సీనియర్స్ అందరూ బాగా సరదాగా మాట్లాడటం, లాబ్స్ లో ప్రాక్టీకల్స్ లో కనిపిస్తే వచ్చి ఎలా చేస్తే ఈజీనో చెప్పడం అలా సరదాగా రోజులు గడిచిపోతున్నాయి. మొదటినుంచీ రాధ గలగలా మాట్లాడుతూ సరదాగా ఉండే పిల్ల. కానీ మోహన్ అటు ఇంట్రావర్ట్ కాని ఇటు ఎక్స్ట్రావెర్ట్ కాని పిల్లాడు. ఎన్నిసార్లు పక్కకి రాగ్గింగ్ నుంచి తీసుకెళ్లినా ఒక్క మాట ఎక్కువ మాట్లాడేవాడు కాదు. రాధ మాటల్లో ఏదైనా అవసరం అన్నట్లు మెన్షన్ చేస్తే మరునాడు ఆ సబ్జెక్టు నోట్స్ తెచ్చి ఇచ్చి

" చదువుకుని నోట్స్ రాసుకుని ఇచ్చేయ్" అని మాత్రం చెప్పేవాడు. ఇష్టం అన్నట్టు కూడా ప్రవర్తించేవాడు కాదు. కొన్నిట్లో బాగా ఆర్గనైజ్డ్ గా, కొన్నింటిలో అయోమయంలా అనిపించి మోహన్ ని చూసి నవ్వుకునేది రాధ.

ఫ్రెషర్స్ డే రిహార్సల్ లో రాధ 'వే వేల గోపెమ్మల, మువ్వ గోపాలుడే, మా ముద్దు గోవిందుడే' పాట పాడుతుంటే విని "మనకీ టాలెంట్ కూడా ఉందా?" అని అడిగాడు కళ్ళింత చేసుకుని.

ఆ తర్వాత హాస్టల్ సీనియర్ అక్క కృష్ణ వచ్చి " ఏంటి రాధా, మోహనరాగం వదలేట్టు లేదే నిన్ను?" అని నవ్వుతూ చెప్పింది.

మోహన్ కూడా ఫ్లూట్ ప్లేయర్ అని, ఫస్ట్ ఇయర్ చాలా ఉత్సాహంగా అన్నింట్లో పాల్గొనేవాడని, ఈ మధ్య కొంచెం స్టూడియస్ గా, నెమ్మదిగా అయిపోయాడు కానీ ఇది తన స్వభావం ఐతే కాదు అంటే అవునా అనుకుంది రాధ.

తర్వాత చాలా నెలలకు తెలిసింది కృష్ణ అక్క ఇంట్లో ఏవో కష్టం ఉంటే ఫీజు కట్టడానికి తన ఇంట్లోవాళ్ళు నెలనెలా పంపినవి అన్ని కూడబెట్టి ఇచ్చాడని, చాలా మంచివాడని, తనకేమి కావాలన్నా ఎవరితో చెప్పుకోడు కానీ ఎవరికీ ఏమి కావాలన్నా నిలబడి చేసేరకం అని... ఎంతమందిలో ఉన్నా కృష్ణక్క కనిపిస్తే వచ్చి ఎలా ఉన్నావ్ అని అడిగేవాడు, అందరితో ఉన్నట్టే ఉంటూ ఎవరితోనూ క్లోజ్ గా ఉండడని అర్థమైంది, తన వాళ్ళు అనుకుంటే తప్ప.

మోహన్ కేరింగ్ గా ఉన్నట్టే ఉంటూ అంటీ ముట్టనట్టు ఉండటం గమనించింది రాధ, ఓ రోజు మోహన్ ని పిలిచి

"రాగిగుడ్డ ఆంజనేయస్వామి గుడికి వెళ్లాలనుకున్నాను.. రూంలో వాళ్ళకి కుదరట్లేదు. వస్తారా?" అడిగింది.

"సరే" అన్నాడు, ఆటో తీసుకుని హాస్టల్ దగ్గరికి వచ్చి, వెనక తను కూర్చుంటే ముందు ఆటోడ్రైవర్ పక్కన కూర్చున్నాడు. సన్నగా నవ్వుకుంది రాధ. రాగిగుడ్డ గుడి పక్కన ఓ చిన్న కొండ లాంటి గుట్ట. దానిమీద కూర్చుంటే జేపీ నగర్ పార్క్ పచ్చటి బెంగళూరు అందంగా ఆహ్లాదంగా. కాస్సేపు కూర్చుందామని చెప్పి తీసుకెళ్లి మాటల్లో పెట్టింది. 3 ఏళ్ళు పట్టింది ఈ మాత్రం మాట కలపడానికి అనుకుంటూ.. మాటల్లో

"మీది విజయవాడ కదా. మాది అదే అని మొదటిరోజే నేను మాట్లాడకముందే ఎలా తెలిసింది?" అని అడిగింది రాధ.

"నేను నిన్ను కౌన్సిలింగ్ లో చూసాను రాధా, అప్పుడే పేరు ఊరు తెలుసు" అని చెప్పాడు మోహన్.

ఆశ్చర్యపోవడం రాధ వంతు అయింది.

తర్వాత కాలంలో చాలా సార్లు చెప్పకుండానే అర్థం చేసుకుని సపోర్ట్ చెయ్యడం, ఊరు వెళ్లి వచ్చేటప్పుడు కలిసి ప్రయాణాలు... బాగా క్లోజ్ ఫ్రెండ్స్ అయ్యారు ఇద్దరూ. ఓ సారి అనాటమీ ల్యాబ్ లో గ్రేడ్స్ బాగా రాలేదని డల్ ఉంటే దగ్గరికి వచ్చి, "ఏమయ్యింది.? కళ్ళు

చూసుకున్నావా ఎలా ఉన్నాయో!? గ్రేడ్స్ తో సర్జరీలు చెయ్యరు. వర్రీ అవ్వకు" అని కొంచెంగట్టిగానే చెప్పాడు మోహన్. తర్వాత లాబ్స్ ఎప్పుడు ఉన్నా ఓ సారి వచ్చి వెళ్ళేవాడు "జస్ట్ చెకింగ్ ఆన్ యూ.." అని.

మూడో సంవత్సరం.. ఓరోజు పేతాలజీ ప్రాక్టీకల్స్. కడేవర్ ( వైద్య విద్యార్థుల కోసం రసాయనాలతో భద్రపరచపడిన మృతదేహం ) అప్పటికే అలవాటు అయినా, ఆరోజు ఒక జూనియర్ డాక్టర్ వచ్చి స్కెలెరోసిస్ (sclerosis) మీద మాట్లాడుతుంటే నోట్స్ రాసుకుంటూ పక్కన చూసింది రాధ. కడేవర్ చేతిమీద ఒక చిన్న పచ్చబొట్టులాంటి గుర్తు. ఏదో పేరనుకుంటా అని చూస్తే ' లవింగ్ టు లివ్ విత్ యువర్ లవ్' అని. వెంటనే మొహం చూసింది. ఒక్క ఉదుటున పరుగుతో బయటికి వచ్చేసి పక్కన లాన్ ఏరియాలో బెంచ్ మీద కూర్చుని మొహం చేతుల్లో దాచుకుని ఏడుస్తోంది.

కాస్సేపటికి పక్కన ఎవరో కూర్చోటం తెలుస్తోంది. మోహన్ అని చెప్పింది రాధ మనసు. అది కేవలం ఊహా లేక తానే ఐతే బాగుణ్ణన్న కోరికా... తెలియదు.. సున్నితంగా భుజం పట్టుకుని

"ఏమ్మా ఏమైంది?" అన్నాడు మోహన్ లాలనగా.

"ఏమో తెలీదు.. తప్పు ఛాయిస్ తీసుకున్నానేమో.. ఇంత పాజిటివిటీ తెలివితేటలూ ఉన్నాయి డాక్టర్ అయితే ఎన్నో జీవితాలు స్పృశిస్తావ్' అని నానమ్మ చిన్నప్పటినుంచి చెప్తుంటే అలా తెల్లకోటు స్టెతస్కోపు ఆటలు ఆడుకుంటూ నెమ్మదిగా ఇక్కడకు వచ్చేసా. కానీ నాకు కడేవర్ చూస్తే కన్నీళ్లు వస్తున్నాయి. మనం నేర్చుకోవడానికి – మనలాగే ఆశలు ఆశయాలు ప్రేమ.. అన్నింటితో బ్రతికిన వాళ్ళని, వాళ్లకి తెలియకుండా బాడీ అని కడేవర్ అని... డాక్టర్లకి మాత్రమే అర్థం అయ్యే పేతాలజీ జోకులు వేసుకుంటూ వాడుకుంటున్నామా!?. మే బి అయామ్ నాట్ కట్ ఫర్ ఇట్... నా వాళ్ళ కాట్లేదు" అని భోరుమంది రాధ.

మోహన్ అప్పటిదాకా ఓపికగా విన్నాడు. నెమ్మదిగా దగ్గరికి జరిగి.

"అంతేనా..!? కాంటీన్ కి వెళ్లి మాట్లాడుకుందామా.. లేకపోతే బయటికి వెళ్దామా?" అన్నాడు ప్రేమగా.

"కాస్త బయటికి వెళ్దాం" అంది రాధ.

"రాగి గుడ్డ గుడికి వెళ్లి గుట్ట మీద కూర్చుందామా? లేకపోతే ఈ సారి నాకు ఇష్టమైన చోటికి తీసుకెళ్ళనా?" అన్నాడు మోహన్.

" మీ ఇష్టం" అంది తను.

"సరే ముందు హాస్టల్ కి వెళ్లి ఆప్రాన్, బేగ్ పెట్టేసి చక్కగా రెడీ అయ్యిరా.. హెవీ డ్రస్ కాకుండా... వాకింగ్ షూస్ కూడా వేస్కో" అన్నాడు మోహన్.

"సరే" అంది రాధ. బైక్ మీద హాస్టల్ కి తీసుకెళ్లి బయట మోహన్ వెయిట్ చేస్తుండగా, వెళ్ళి మొహం కడుక్కుని లేత పచ్చ రంగు డ్రెస్ వేసుకుని , రీబక్ షూస్ వేసుకుని రెడీ అయ్యి వచ్చింది రాధ.

రాగానే "ఏమ్మా కాటుక పెట్టుకోలేదు. అసలు మేజిక్ అంటే ఆ కళ్ళే కదా.. వెళ్ళు! కాటుక పెట్టుకునిరా" అన్నాడు. చురుగ్గా చూసింది రాధ.

బ్రతిమాలుతున్నట్టు మొహం పెట్టాడు మోహన్. హాయిగా నవ్వేసి వెళ్లి కాటుక పెట్టుకుని వచ్చింది.

ఏడ్చి ఉండటంతో కాలేజీలో కాటుకంతా కళ్లకిందకి వచ్చేసింది. మళ్ళీ ఏడుస్తే మళ్ళీ అదే పరిస్థితి కదా అని పెట్టుకోడం మానేస్తే, అది కూడా గమనించాడీ మానవుడు అనుకుంటూ లోపల "అంటే ఇష్టాన్ని ఎక్స్ప్రెస్ చెయ్యడం కూడా వచ్చే!" అని ఆశ్చర్యం.. ఒకింత పులకరింత!. చిన్న పాటి గర్వం! ఇంకొంచెం బిడియం! నెమ్మదిగా నడుచుకుంటూ రాగానే తన కళ్ళవైపు ప్రేమగా చూసి చిన్న నవ్వు నవ్వి..

"రామ్మా సావిత్రి దీక్షిత్.. కూర్చుంటే వెళ్దాం" అన్నాడు మోహన్.

"అదెవరి పేరు నేనైతే కాదే అంది" రాధ.

"అవును సావిత్రి మాధురి దీక్షిత్ కన్నా ఎక్కువే. ఆ కళ్లలో ఎన్నెన్ని భావాలు మరి." అన్నాడు కొంటెగా నవ్వుతూ.

"హే! పర్లేదే.. నాట్ బాడ్ ఫర్ ఏ పప్పు" అనేసింది పైకే, రియాక్షన్ కోసం ఎదురుచూడకుండా, మోహన్ నవ్వు చూస్తూ..

బైక్ మీద ఫ్రీగా కూర్చుని వెనక్కాల రైలింగ్ పట్టుకుని "లెట్స్ గో" అంది రాధ.

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ క్యాంపస్ దగ్గరే.. అక్కడ వాకింగ్ ట్రైల్స్ బాగుంటాయి అని మోహన్ చెప్పగా వింది అదివరకు. అక్కడికే అయ్యిఉంటుంది అనుకుంటూ.. కానీ సీవీ రామన్ రోడ్ లో ఎడమ వైపు తిప్పాడు. ఏదో పాట హమ్ చేస్తూ.. కొంచెం తల వాల్చి రిక్కించి వింది ఏంటా అని. ఎక్కడికి తీసుకెల్తాడన్న కుతూహలం కాస్సేపు పక్కన పెట్టి అంత పాపులర్ కాకపోయినా ఎంతో భావుకత ఉన్న ఎస్వీ కృష్ణారెడ్డి పాట –

' కాటుక పిట్టల మాదిరి ఎగిరే కన్నులు రెండూ...

అవి నీ పైనే వాలేనేమో కొంచెం గమనించు.. '

అని.. రాధ వింటున్నదని అర్థమై పైకే పాడాడు ...

"నల్లని కన్నుల వెన్నెల వల నిన్ను అల్లుకోవచ్చు..

మాటలకందని మూగసైగలతో మాత్రం వెయ్యచ్చు.

నువ్వు తీరా అటు చూసేసరికే బిడియం రావచ్చు.."

చాలా మంచి గొంతు. దాన్ని మించిన ఏదో భావం గొంతులో. అబ్బో చాలా ఉందే విషయం, బయటపడడు కానీ, అనుకుంది. కానీ తనని క్లియర్ గా బాడ్ మూడ్ లోనుంచి బయటకు తీసుకు రావడానికి అని కూడా అర్థం అవుతూనే ఉంది. అందుకే మనసు ప్రేమలో దూదిపింజలా తేలిపోతున్నా గుండె లోతుల్లో ఇంకా ఏదో అలజడి. ఆ తీయని క్షణాలని పూర్తిగా స్వాదించలేకపోతున్నాని అర్థమైంది రాధకి. ఇంతకన్నా మంచిరోజు దొరకలేదా ఈ మానవుడికి ఎక్స్ప్రెస్ చెయ్యటానికి అనుకుంది రాధ.

రోడ్ గమనించకుండా ఆలోచనల్లో మునిగిపోయిన రాధకి "ఫ్యూ మినిట్స్. ఇప్పుడే వస్తా. వెయిట్ చెయ్యి" అని ఒక ఇంటి ముందు ఆపాడు. సదాశివనగర్ అనుకుంటా చక్కటి రెండంతస్తుల ఇల్లు.

"ఎవరిల్లు?" అంది కుతూహలంగా.

"నారూం లే.. ఇప్పుడే వస్తా!" అన్నాడు మోహన్.

"నేను చూడచ్చా?" అంది రాధ.

కొంచెం ఆశ్చర్యంగా చూసి "షూర్ రామ్మా, వై నాట్" అన్నాడు.

బైక్ దిగి నడుస్తుంటే కొంచెం పెద్ద అంగలేసి ముందుగా లోపలకి వెళ్ళాడు ఒక డోర్ కీతో తెరిచి. డోర్ దాకా వెళ్లి ఆగింది రాధ.

"రా" అన్నాడు.

లోపలికి వెళ్లేసరికి ఏవో బట్టలు అలమరాలో పెట్టి వెనక్కి తిరిగి "వాటర్ కావాలా?" అన్నాడు.

"వద్దు" అంది కానీ అప్పటికే ఆశ్చర్యంగా చూస్తోంది రాధ. చాలా పొందికగా సర్దుకున్న మెడికల్ పుస్తకాలు, కాన్వర్సేషన్ విత్ గాడ్ నుంచి బహ్మసూత్ర భాష్య వరకు ఎన్నో మంచి సాహిత్యం, రైటింగ్ డెస్క్ మీద చాలా ఫోల్డర్లు లో పేపర్లు, తీసి చూస్తే ఏవో చేతి రాతలో ఉన్న ఆర్టికల్స్, ఇంకో మూల చిన్న డెస్క్ మీద రమణులు, శంకరాచార్యులు చిన్న లామినేట్లలో.. ముందొక చిన్న దీపం.. డెస్క్ ముందు చిన్న చాప..

ఓ పక్కగా నీటుగా సర్దిఉన్న పరుపు దిండు.. ఆడపిల్లలమైనా తన హాస్టల్ ఎలా ఉంటుందో గుర్తొచ్చి కాస్తంత సిగ్గనిపించింది రాధకి. తనమట్టుకి పర్లేదు మరీ ఇంత కాకపోయినా, నీట్ గా లేకపోతే తనకీ నిద్రపట్టదు. 'బట్ థిస్ ఈజ్ టూ మచ్ అబ్బ!' అనుకుంది.

డెస్క్ కిందనుంచి ఒక రెక్టాంగ్యులర్ బాక్స్ తీస్కుని హేండిల్ని భుజానికి వేస్కుని "వెళ్దామా?" అన్నాడు.

"ఏంటది?" అంది కుతూహలంగా.

"చెప్తా పద" అన్నాడు వడివడిగా అడుగులేస్తూ.

"ఎక్కడికి?" అంది మళ్ళీ.

"అదీ చూస్తావుగా" అన్నాడు మోహన్ నవ్వుతూ.

బళ్ళారి రోడ్, రిజర్వు బ్యాంకు, పాలస్ రోడ్ దాటుకుని లాల్ బాగ్ రోడ్డులోకి తిరగగానే అర్థమైంది రాధకి. బొటానికల్ గార్డెన్ కి అని, సౌత్ గేట్ బయట బైక్ పార్క్ చేసి తనని ఆగమని వెళ్లి దగ్గర ఫ్లవర్ షో టికెట్ తీస్కుని వచ్చాడు. చేతిలో రెండు క్వాలిటీ ఐస్ క్రీములతో సహా.

240 ఎకరాల్లో పచ్చటి బెంగుళూరుకే హృదయస్థానంలాంటిది లాల్ బాగ్ బొటానికల్ గార్డెన్. జనవరి లోను ఆగష్టు లోను మాత్రమే జరిగే పూల ప్రదర్శన చాలా స్పెషల్. మొదటి సంవత్సరంలో ఫ్రెండ్స్ తో వచ్చింది రాధ. ఆ తర్వాత వెళ్లాలనుకున్నా అందరికీ అలాంటి ఇష్టాలు లేకపోవడంతో పాటు క్లినిక్ డ్యూటీలు ప్రాక్టీకల్స్ తోడయ్యి మళ్ళీ రావడం కుదరలేదు. ఇద్దరికీ ఒకేలాంటి ఇష్టాలు అనుకుంది మళ్ళీ.

ఐస్ క్రీం చేతికిచ్చి కీస్, టికెట్స్ జేబులో పెట్టుకుని నడవటం మొదలు పెట్టారు ఇద్దరూ. రకరకాల పూలు, అందులో వైద్యానికి సంబందించినవి.. ఎక్కడినుంచి వచ్చాయి అలాంటి చాలా విషయాలు చెప్తూ మొత్తం అంతా తిరిగేసరికి సాయంత్రం ఆరయ్యింది. కేఫ్ లోకి వెళ్లి చాట్, జ్యూస్ తెచ్చుకుని ఒక బెంచ్ మీద కూచున్నారిద్దరు. జ్యూస్ షాప్ వాడు పలకరించడం, గిన్నె కడిగి ఫ్రెష్ గా ఆరంజ్ లు జ్యూస్ చేసి పేపర్ గ్లాసులో తెచ్చి ఇవ్వడం "మేడమా!? కంగ్రాట్స్ సార్" అని నావైపు చూసి నవ్వడం రాధ దృష్టిని దాటిపోలేదు.

"రెగ్యులర్ గా వస్తారా? టైం ఎక్కడ దొరుకుతుంది అసలు?" అంది రాధ. చిన్నగా నవ్వాడు మోహన్.

"సమయం అనేది మన చేతుల్లోనే ఉంటుంది రాధా! ఎవరైనా దేనికైనా సమయం లేదు అన్నారంటే అది వాళ్ళకి అంత ముఖ్యం కాదు అని అర్థం. సమయం లేకపోడం అనేదే ఉండదు. మన సమయాన్ని మనకు ముఖ్యమైన వాటితో చక్కగా ప్లాన్ చేసుకుంటే 24 గంటలు 365 రోజుల్లో ఏదైనా చేయచ్చు అన్నాడు. నేను కోర్స్ చదువుకోడానికి, ఫ్లూట్ వాయించుకోడానికి, నాతో నేను సమయం గడపడానికి, సింహావలోకనం చేసుకోవడానికి, నా ఆటలకు, ఏదైనా ఆర్టికల్స్ రాయడానికి, మంచి పుస్తకాలు చదవడానికి.. నీ గురించి ఆలోచించడంతో సహా.. నాకు ముఖ్యమైన వాటికీ నాకు ఇప్పటికి ఎప్పటికి సమయం ఉంటుంది! " అన్నాడు మోహన్.

మూడేళ్ళలో మోహన్ మాటల్లో ఇంత సూటితనం నిక్కచ్చితనం మొదటిసారి వినిపించాయి రాధకి. బలమైన వ్యక్తిత్వం అని తెలుసు కానీ బయటికి వ్యక్తీకరించడం చూడలేదు ఎప్పుడూ.. చాలా అబ్స్యూర్ అనుకుంది రాధ.

"మీ అంత గట్టిదాన్ని కాదేమో మోహన్! చూడటానికి గలగలా మాట్లాడినా, నేను చాలా ఎమోషనల్. అనాటమీ పాథాలజీ నన్ను ఇబ్బంది పెడుతున్నాయి. అబ్స్టెట్రిక్స్ వార్డ్ కి వెళ్ళినప్పుడు ఆడవాళ్ళ విలువ అమ్మ మీద గౌరవం పెరిగినా, ఎదుటివారి నొప్పిని చూడలేని నా బలహీనతని అధిగమించలేకపోతున్నా. ఇక నేనుఏమి డాక్టర్ని. ఏమి చెయ్యగలను అనిపిస్తోంది" అంది. రాధ కళ్ళల్లో మళ్ళీ కన్నీటి తెర!

దగ్గరికి జరిగి ఎడమ చెయ్యి తీసుకుని చేత్తో సుతిమెత్తగా చేత్తో తట్టి, " సరే నేను కూడా నీలాగే ఇక్కడికి వచ్చాను కదా! నా విశ్లేషణ చెప్తా, విను. ఆ తర్వాత నీ నిర్ణయం ఏదైనా నేను నీకు తోడుంటా" అన్నాడు.

తలూపింది రాధ.

"చిన్నపటినుంచి డాక్టర్ కలలు కని ఉరకలెత్తే కుర్రవయసులో ఎంసెట్ రాసి మెడికల్ సీట్ తెచ్చుకుని, అక్కడినుంచి వైద్య కళాశాలలో చేరడం అనేది ఒక 'జీవి పుట్టుక' లాంటిది.

అప్పటిదాకా వేరే జీవి రక్షణలో వెచ్చగా, కణానికి కణం తోడవుతూ నెమ్మదిగా పెరుగుతూ, వీర్య కణాల పరుగుపందెంలో తానే గెలిచి జీవం పోసుకున్నానన్న గర్వంతో ఎదుగుతూ ఇంకో జీవి రక్తం వేడితో శక్తినందుకుంటున్న నరాలతో. ధైర్యంగా ఉన్న జీవి... హఠాత్తుగా... అక్కడి నుంచి పరిచయం లేని లోకం లోకి నెట్టివేయబడటం... అదే జీవి పుట్టుక.

ఇక్కడ ఎదగడమే పరుగుపందెం. మొదటి క్షణంలోనే ఎన్నోచూపులు ఆ జీవిపై. వాళ్ళనుకున్నట్టు అమ్మాయివా అబ్బాయివా.. అన్నీ క్రోమోజోములతో వచ్చావా.. కాళ్ళు చేతులు కళ్ళూ అన్నీ సరిగ్గా ఉన్నాయా.. అని వేల ప్రశ్నలతో నిండిన చూపులు. ఊపిరి పీల్చుకుందామంటే మొదటిసారి ఊపిరితిత్తులు మండేంత గాలి. ఆ మంటకి ఇబ్బందికి ఏడ్చి కళ్ళు తెరవగానే తెలుస్తుంది. ఇక ఎదగడమే పరుగుపందెమైన ప్రపంచంలోకి స్వాగతం అని..

మెడికల్ కాలేజీ జీవితం అంతేనమ్మా. అంత పెద్ద పుస్తకాలు సీనియర్స్ చేతుల్లో చూసి మొదట్లో భయం వెయ్యదు. ఎందుకంటే మన శరీరం లో జరుగుతున్న ప్రతి చిన్న విషయాన్నీ తెలుసుకోవాలన్న ఉత్సాహం. ఊపిరి తీసుకున్న ప్రతీసారి ఒక తరం బాక్టీరియా లోపలికి వచ్చి మరుక్షణం బయటికి ఎలా వెళ్తున్నాయన్న కుతూహలం. తనలో పరుగుపెట్టే రక్తాన్ని నియంత్రించే ఇంజిన్ ఆర్కిటెక్చర్ చూడాలన్న ఆత్రం. ఈ మాంసం రక్తం ఎముకలతో చేసిన దేవాలయం లాంటి దేహాన్ని దానిలో జరిగే ప్రతి చిన్న ఘటనని అర్ధం చేసుకుని, రాబోయే తరానికి బాధ్యత గల వైద్యులుగా సేవ చెయ్యాలన్న తపన. వీటితో మొదలవుతుంది ఇక్కడ జీవితం. మొదటిసారి కడేవర్ దగ్గరికి వెళ్ళినప్పుడు భయంతో పాటు కుతూహలం. మొదటి ఆబ్స్టెరిక్స్ వార్డ్ డ్యూటీలో ప్రసవం చూసి అమ్మకి దండం పెట్టాలనిపించిన క్షణం, అప్పటినుంచి ఆడవాళ్ళని చూసే దృక్కోణంలో మార్పు. కేలండర్ నిండా ఎర్రటి సర్కిల్స్.. క్లినిక్ విజిట్లు, వార్డ్ డ్యూటీలు, రూంలో అస్థిపంజరాలు ముక్కల తో పార్ట్ కంప్లీషన్ అసైన్మెంట్లు.. వీటితో సతమతమవుతూ ఎంతో తెలివితేటలతో ఇక్కడికొచ్చామన్న లేత మనసుల్లో తమతో పాటు చదువుకుని సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు చేసేస్తున్న వాళ్ళని చూసి, తప్పు దారి తీసుకున్నామా అన్న రోజులుండవు అని చెప్పను. కానీ మనం కన్న కల కోసం ఎంతో మందికి సహాయపడే వృత్తిని వంటబట్టించుకోడం కోసం.. ఇదంతా పెద్ద అసాధ్యం కాదన్న స్పృహ... మనకి అవసరం కదా.."

ఒక మనిషిని కోస్తున్నామని బాధ పడి లోపల ఉన్న కాన్సర్ కంతిని వదిలేస్తే మనిషే ఉండదు కదమ్మా. మనం విద్య నేర్చుకోడానికి వాడే కడేవర్.. వాళ్ళ దగ్గరి వాళ్ల ఇష్టంతో నే తీసుకుంటారు. పోయిన తర్వాత కూడా మానవజాతికి ఎదుగుదలకు తోడ్పడుతున్న వారి జన్మ సార్ధకం కాక ఇంకేమిటి.."

"మందు చేదుగా ఉందని వేసుకోడం మానేస్తే రోగం ఎలా తగ్గదో, మనిషిని కొయ్యాలి అని సర్జరీలు మానేస్తే ఇక మనుషులు బ్రతకరు. ఆస్ట్రోనామర్ల లాగే డాక్టర్లు కూడా కాలం తో పోటీ పడుతూ, జీవితాంతం నేర్చుకుంటూ, కొత్త కొత్త కృష్ణ బిలాల వంటి రోగాలు, వైరసులు... కనిపెడుతూ వాటితో పోరాడుతూ... కర్మణ్యే వాధికారస్తే. అన్నట్లు మన పని మనం చేస్తూ పోతేనే మన జన్మ కూడా సార్ధకం..

కన్నీళ్లు రావడం తప్పు కాదు, అది నీలో ఉన్న మానవత్వానికి, మానవత్వానికి నువ్విచ్చే విలువకీ.. నిలువెత్తు నిదర్శనం. అంతమాత్రాన నువ్వు వీక్ అనుకోకు, నీలాంటి సున్నితమనస్కులు చాలా గొప్ప వైద్యులవుతారు. నువ్వు కలిసిన ప్రతీ మనిషి జీవితకథలో నీకో పేజీ తయారుచేసుకుంటావు. పెర్సనల్ టచ్ అంటారే అది ఉంటుంది.

మొదటినుంచీ నీలో నాకు నచ్చింది కూడా అదే. సూటిగా మాట్లాడే తత్త్వం, నీ పని నువ్వు చేసుకుపోయే గుణం, కౌన్సిలింగ్ రోజు ఒక పెద్దాయన సుగర్స్ తగ్గిపోతే, నువ్వు వెళ్లి ఫ్రూటీ తెచ్చి ఇచ్చి లైన్ దగ్గరికి కుర్చీ తెచ్చి వేసినప్పుడే నిన్ను చూసాను. ఈ అమ్మాయిని నాకనుగ్రహిస్తే మా కాలేజీలో చేరేట్లు చూడు స్వామి అనుకున్న క్షణం... తర్వాత... నీలో ఇంకా ఇంకా నచ్చినవి... జీవితం పట్ల చక్కటి

అవగాహన, శ్రావ్యమైన గొంతు, సాహిత్యాభిలాష.. ఇంక కట్టి పడేసే, ఎప్పుడూ నవ్వే, ఆ ప్రమాదకరమైన కళ్ళు కూడా...” అన్నాడు నెమ్మదిగా.

అప్పటిదాకా జ్ఞాని మోడ్ లో మాట్లాడిన మాటల్లో ఒక్కసారిగా కొంటెతనం తొంగి చూసేసరికి చివ్వున చూసింది రాధ. సమాధానం కోసం చూడకుండా బాక్స్ లోనుంచి ఫ్లూట్ తీసి పంచరత్న కృతి మొదలుపెట్టాడు మోహన్.

‘సమయానికి తగు మాటలాడెనే....’

ఆరభి రాగంలో అందమైన కృతికి తన గొంతుకలిపింది రాధ. ఎడమచేయి తీసుకుని చనువుగా నొక్కి “ఏంటి మహారాణి... సరేనా?” అన్నాడు మోహన్.

కళ్ళతో సరే అని తల భుజం పై వాల్చింది రాధ.

అదే తన బిగ్ డే మరి.. ఎడమ చేతిని తేలిగ్గా ముద్దాడి “పద! లేట్ అవుతోంది హాస్టల్ లో గోల పెడుతారు” అన్నాడు.

“అనుకోకుండా ఫ్రెండ్ అయ్యి నాకే తెలియకుండా ప్రేమించేలా చేసారుగా... టూ మచ్!” అంది రాధ, మోహన్ చెయ్యి పట్టుకుని లేస్తూ.

“అమ్మా, ఇట్స్ డార్క్ ఆల్రెడీ, యూ ఆర్ స్టిల్ ఇన్ ద బ్యాక్ యార్డ్...” అంటూ వచ్చాడు చిన్నూ.

టక్కున లేచి ఈలోకం లోకి వచ్చి టైం చూసి మోహన్ కి ఫోన్ చేసింది... ఏంటి ఇంకా రాలేదని.

“ఇప్పుడే సర్జరీ అయ్యిందోయ్. వస్తున్నా. డోంట్ మిస్ మీ టూ మచ్ మై ఏంజెల్!” అన్నాడు. ఎన్నేళ్లు అయినా అదే చిలిపిదనం.

“అవును. మిస్సింగ్ యూ టూ మచ్! రండి!” అని పెట్టేసింది రాధ.

కాల్ అవ్వగానే డిఎస్పీ ప్లేలిస్ట్ మళ్ళీ మొదలయింది...

నువ్వు.నువ్వు.నువ్వూ.
నాలోనే నువ్వు నాతోనే
నువ్వు
నా చుట్టూ నువ్వు
నేనంతా నువ్వు
నా పెదవిపైన నువ్వు నా
మెడవంపున నువ్వు
నా గుండె మీద నువ్వు
ఒళ్ళంతా నువ్వు
బుగ్గల్లో నువ్వూ
మొగ్గల్లే నువ్వు
ముద్దైసే నువ్వూ
నిద్దర్లో నువ్వూ

పొద్దుల్లో నువ్వు
ప్రతి నిమిషం నువ్వూ...
నువ్వు .నువ్వు.నువ్వే
నువ్వు
నువ్వు.నువ్వు.నువ్వూ

(వచ్చే నెల మరో మోహనం)

Post your comments